క్లుప్తంగా

17న నీట్ మాక్ పరీక్ష

మహబూబ్‌నగర్ఎడ్యుకేషన్: త్వరలో ప్రభుత్వం జాతీయ స్థాయిలో మెడికల్ కళాశాలల్లో సీట్ల భర్తీకోసం నిర్వహించే నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈనెల 17న నీట్ మాక్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు వాగ్దేవి కళాశాల కరస్పాండెట్ వెంకట్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10గంటలకు పరీక్షను కళాశాలలో నిర్వహిస్తామని, ఆసక్తిగల విద్యార్థులు 9133005544 నంబర్‌కు ఫోన్ చేసి పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్, బోయిన్‌పల్లి గ్రామాల్లో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆపద సమయంలో సీఎం సహాయ నిధి డబ్బులు అండగా నిలుస్తాయని మాజీ సర్పంచ్‌లు శశికళ, జంగయ్య అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బంగారు, నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, విక్రం బంగారయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఆమెర్ సోహైల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనుప శేఖర్ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా అజ్మత్‌అలీ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్, సేవాదళ్ నాయకుడు జగదీశ్, జాహెద్, జమీర్, ఇమాద్, ఫేరోజ్, అద్నాన్, శేఖర్, ప్రకాష్, కిరణ్ పాల్గొన్నారు.

పీయూలో ఆవిర్భావ వేడుకలు...

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పీయూ అధ్యక్షుడు వంశీకుమార్ ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. నాయకులు కనక, విజయ, అఖిల, రవీందర్, నరేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీసు

దేవరకద్ర: గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న నిర్వహించే టోకెన్ సమ్మెపై బుధవారం దేవరకద్ర తహసీల్దార్ కృష్ణయ్యకు సమ్మె నోటీసును అందజేశారు. జీఓ 51ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఇఎస్ఐ, బీమా కల్పించాలని కోరుతూ సమ్మె నోటీసులు అందజేశారు.

నర్సరీల సంరక్షణ అందరి బాధ్యత

నవాబుపేట: నర్సరీల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో, లోకిరేవులో నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీలను ప్రణాళిక ప్రకారం పెంచి గ్రామాల్లో మొక్కలు పెంచేలా వాటిని సిద్ధం చేయాలన్నారు. నీటి ఎద్దడి ఉంటే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని అందించాలని అన్నారు.ఎంపీహెచ్‌ఓ బద్రు నాయక్, ఏపీఓ జ్యోతి, జంగమ్మ ఉన్నారు.

రోడ్లపైనే ఉల్లి విక్రయాలు



దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డు వద్ద రోడ్లపైనే ఉల్లి విక్రయాలు జోరుగా సాగాయి. బుధవారం మార్కెట్ సెలవు ఇచ్చిన కారణంగా మంగళవారమే ఉల్లి వేలం జరిగింది. అయితే చాలా మంది ఉల్లిని కొనడానికి బుధవారం మార్కెట్ వస్తారు. దీంతో వివిధ గ్రామాల నుంచి రైతులు ఉల్లి బస్తాలను ట్రాక్టర్లపై తెచ్చి నేరుగా విక్రయాలు సాగించారు. గూరకొండ, గోప్లాపూర్, మరికల్, కోయిల్‌కొండ నుంచి రైతులు ముందుగానే తూకాలు వేసి ట్రాక్టర్లపై తెచ్చిన ఉల్లి బస్తాలను రోడ్లపై పెట్టుకొని అమ్మకాలు సాగించారు. మార్కెట్ బయటే వేయి బస్తాల ఉల్లిని రైతులు అమ్మకాలు జరిపారు.

నాణ్యతతో అందించాలి

కోయిల్‌కొండ: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని నాణ్యతతో అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కోత్లాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో ని ర్వహించిన పోషణపక్షం–పోషణ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని పిల్లలకు తినిపించేలా తల్లిదండ్రులు చూసుకోవాలని ఆమె కోరారు.

అంజన్న కటాక్షం అందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- విద్యా నిధికి టీఎన్‌జీఓల రూ. 10లక్షల విరాళం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం 16వ వార్డులోని మహ్మద్‌ఖాన్‌పల్లి తండాలోని వీరాంజనేయస్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీర ఆంజనేయస్వామి కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయం అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. తండా సమస్యలను తీరుస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు మోతీలాల్, జాజిమొగ్గ నర్సింలు, దేవేందర్ నాయక్, అబ్దుల్ హక్, శ్రీనివాస్‌యాదవ్, జోజ్యు నాయక్, డీఎం.నాయక్, గోపి నాయక్, శరత్‌చంద్ర, హన్మంతు నాయక్, కృష్ణ, కుమార్, రవినాయక్, శంకర్ నాయక్, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



విద్యానిధికి రూ.10 లక్షల విరాళం చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యేకు అందజేస్తున్న టీఎన్‌జీఓ సంఘం నాయకులు

కలెక్టర్‌కు చెక్కు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ విద్యా నిధికి టీఎన్‌జీఓ సంఘం తరపున పది లక్షల రుపాయలు విరాళం అందజేశారు. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిరకు పది లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది గొప్ప మార్పు అని భావిస్తున్నట్లు పేద విద్యార్థుల కోసం సమకూర్చే విద్యా నిధి అనే యజ్ఞంలో టీఎన్‌జీఓలు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం

మహబూబ్‌నగర్ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గ్రౌండింగ్ వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. మండలంలోని పోతన్‌పల్లి గ్రామంలో సూర్యకళ ఇంటి నిర్మాణానికి కలెక్టర్ భూమిపూజ చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. మొత్తం 129 లబ్ధిదారులకు ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వెన్నాచేడ్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: రైతులు దళారులను నమ్మి మోసం పోవద్దని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, గండేడ్, కొంరెడ్డిపల్లి గ్రామాల్లో రైస్‌మిల్లు, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. నిరంతరం రైతు శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో చాలా మంది రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి తూకం, తరుగు, తక్కువ ధరలు తదితర వాటి కారణంగా తీవ్రంగా నష్టపోయే వారన్నారు. దీన్ని అరికట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మేలు చేయడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్య, పీసీసీ మెంబర్ నరసింహరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ గోపాల్, బాలయ్య, కృష్ణనాయక్, వెంకట్‌రాంరెడ్డి, శరణప్ప, పులిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయనున్న శిక్షణ కేంద్రంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులను బోధించేందుకు పార్ట్ టైం లెక్చరర్ పోస్టుల కోసం దరఖాసులు ఆహ్వానిస్తున్నామని మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఆర్‌సీ టి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన అభ్యర్థులు ఎమ్మెస్సీ–మ్యాథ్స్, సైన్స్ పూర్తిచేసి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెల రోజుల పాటు డిజిటల్ బోర్డుపై శిక్షణ ఇస్తామన్నారు. అర్హతలను బట్టి రూ.15 వేలు గౌరవవేతనం చెల్లిస్తామని, దరఖాస్తులను ఈనెల 14వ తేదీలోగా మెట్టుగడ్డలోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- చివరి గింజ వరకూ కొంటాం
- కొనుగోళ్లు పారదర్శకంగా చేయాలి
- గన్నీ బ్యాగ్‌ల కొరత లేకుండా చూడాలి
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దేవరకద్ర: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపల్లి, హాజిలాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు పడతాయని తెలిపారు. గ్రేడ్ ఏ రకం సన్నాలకు రూ. 2320, దొడ్డు రకం ధాన్యంకు రూ. 2,300 లుగా మద్దతు ధర ఇస్తారని తెలిపారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ లభిస్తుందని తెలిపారు. రైతులు తమ ధాన్యం దళారులకు అమ్మి మోస పోవద్దని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. గన్నీ బ్యాగ్‌ల కొరత లేకుండా చూస్తామని, అవసరం ఉంటే ముందస్తుగానే సమాచారం ఇవ్వాలని కోరారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ చైర్మన్ కథలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎమ్ రామన్న, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మీపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

48 గంటల్లోనే ధాన్యం డబ్బులొస్తాయి

అడ్డాకుల: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలంలోని గుడిబండ, శాఖాపూర్, మూసాపేట మండలంలోని జానంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

క్రీడలతో మానసికోల్లాసం

చిన్నచింతకుంట: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఎమ్మెల్యే తండ్రి దివంగం గవినోళ్ల కృష్ణారెడ్డి స్మారకార్థం ఓపెన్‌టు ఆల్ కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

మహమ్మదాబాద్: రాజ్యాంగ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు రాంలాల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలో బాగంగా బుధవారం లోని షేక్‌పల్లి, మంగంపేట్‌తండా, చిన్నాయపల్లి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ శాంతిబాయి, బీసీ సెల్ అధ్యక్షుడు ముకుందం, పవన్, నర్సింహారెడ్డి, ఎస్టీసెల్ నాయకుడు సునీల్, ఈశ, మాజీ సర్పంచ్ చంపాబాయి తదితరులున్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్ లో ఐకే పీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రంను బుధవారం జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు తాము పండించిన వడ్లను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.సీసీ యాదమ్మ, గ్రామ పెద్దలు అయ్యన్న, సుకుమార్, బాలయ్య, బంగారు, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

‘స్పాట్’ పారితోషికం పెంచాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలకు సంబంధించి స్పాట్ వ్యాలుయేషన్, కోడింగ్ విధులు నిర్వహిస్తున్న వారికి ప్రతి మూడేళ్ల కోసారి 33 శాతం యథావిధిగా పెంచాలని బీసీటీఏ సంఘం ఆధ్వర్యంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేందర్, ధనుంజయ్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెమ్యూనరేషన్ పెంచాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదో తరగతి పేపర్ వ్యాలుయేషన్ పారితోషికం పెంచాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ వ్యాలుయేషన్ కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమలాకర్, లక్ష్మణ్‌సింగ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని 11 కేవీ ఎంసీ ఫీడర్ పరిధిలో చెట్ల కొట్టివేత కారణంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ వన్ టౌన్ ఏఈ విశ్వంబర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూలక్ష్మినగర్, ఆదర్శనగర్, ఆదర్శనగర్ డబుల్‌బెడ్‌రూం ప్రాంతం, బాలా జీ నగర్, మధురానగర్‌ల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు ఈఅసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బార్‌కు ఒక దరఖాస్తు దాఖలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో నూతంగా ఏర్పాటు చేయనున్న ఒక బార్‌కు బుధవారం ఈఎస్ కార్యాలయంలో బాలరాజు అనే వ్యక్తి టెండర్‌ను ఈఎస్ విజయ్‌భాస్కర్‌రెడ్డికి అందించారు. బార్‌కు ఈనెల 26వరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు సీఐ వీరారెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం టెండర్లు స్వీకరించే బార్‌కు ప్రతి ఏడాది రూ.42లక్షల పన్ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు..

అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని బోయపల్లి గేట్ సమీపంలో బుధవారం రాత్రి టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ ఆధ్వర్యంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఐదుగురు ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వారితో పాటు వాహనాలు స్టేషన్‌కు తరలించారు. డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

తెగిన విద్యుత్ వైర్లు

చిన్నచింతకుంట: మండలంలో బుధవారం రాత్రి ఓ మోస్తారు గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్ గేట్ ముందు భాగంలో ఎల్‌టీ లైన్ విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. కురుమూర్తి గ్రామ సమీపంలో ఆత్మకూర్ వెళ్లే బీటీ రోడ్డు మీద చెట్లు విరిగి పడ్డాయి. దీంతో అప్రమత్తమైన ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారరమిచ్చి విద్యుత్ వైర్లను సరిచేయించాడు.గ్రామస్తులు రోడ్డుపై విరిగిపడిన చెట్లను తొలగించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సహకరిస్తాం



కొత్త కమిటీ వివరాలను ఎస్పీ జానకికి అందజేస్తున్న వినియోగదారుల హక్కుల కమిషన్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సహకరిస్తామని ఎస్పీ డి.జానకి అన్నారు. బుధవారం వినియోగదారుల హక్కుల కమిషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ మడుగు శివశంకర్, వైస్ చైర్మన్ ఎ.రాజసింహుడు, జిల్లా చైర్మన్ మ్యాడమోని చందు, వైస్‌చైర్మన్ జుల్ఫీకర్‌అలీ తదితరులు ఆమెను కలిసి కొత్త కమిటీ వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో చిట్స్, ఫైనాన్స్ మోసాలు, కల్తీ ఆహారంతో వినియోగదారులు నష్టపోతున్నారన్నారు. వీటిని అరికట్టడానికి కమిషన్ సమాయత్తం కావాలని, అందుకు పోలీసుల సహకారం ఉంటుందన్నారు.

రాబోయే రోజుల్లో పాఠ్యాంశంగా వ్యాయామ విద్య

జడ్చర్ల టౌన్: రాబోయే రోజుల్లో పాఠశాలల్లో వ్యాయామ విద్య పాఠ్యాంశంగా మారబోతుందని తెలంగాణ పీడీ పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ స్పష్టం చేశారు. బుధవారం జడ్చర్ల ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి వ్యాయామ విద్య ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యాయామ విద్య పాఠ్యాంశంగా రావటంతో ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందని తద్వారా భవిష్యత్ క్రీడాకారులను తయారు చేసే ప్రక్రియ మొదలై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి మొగులాల్, ఉపాధ్యాయులు మోయిన్, రవికుమార్, శ్రీనివాసులు, విజయ్, సందీప్, వెంకటమ్మ, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.



పీఈటీని సన్మానిస్తున్న నిరంజన్

టోల్‌ప్లాజా వద్ద మరుగుదొడ్లకు తాళం

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



టోల్‌ప్లాజా వద్ద మరుగుదొడ్లకు తాళం

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై కర్నూల్ వైపు వాహనాలు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కొన్నాళ్ల నుంచి వాటి నిర్వహణ లేకపోవడంతో మూతపడ్డాయి. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ వైపు వాహనాలు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న మరుగుదొడ్లు ఉపయోగంలో ఉన్నాయి. కర్నూల్ వైపు మాత్రం మరుగుదొడ్లకు తాళం వేసి ఉండటంతో వాహనదారులు హోటళ్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూల్ వైపు వెళ్లే వాహనదారులు టోల్‌ప్లాజా వద్ద తమ వాహనాలను నిలిపినప్పుడు ఇక్కడి వైపు ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో రోడ్డు దాటి హైదరాబాద్ రోడ్డు వైపు ఉన్న మరుగుదొడ్ల వద్దకు వెళ్తున్నారు. ముఖ్యంగా కార్లలో వెళ్లే మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి నిర్వాహకులు స్పందించి త్వరితగతిన ప్రయాణికులకు మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ, సిర్డ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో మహిళలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ మూసాపేట బ్రాంచ్ మేనేజర్ ఆనంద జ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసే విధంగా గురించి వివరించారు. మహిళలు డబ్బులను పొదుపు చేస్తూ వాటి ద్వారా కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు ఏ విధంగా పనిచేయాలో తెలియజేశారు.

పీయూ అధ్యాపకుల అరెస్ట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే, కాంట్రాక్టు అధ్యాపకులను విధుల నుంచి తొలగిస్తారని, తమను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండల కార్యాలయం వద్ద బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి బయలుదేరుతున్న క్రమంలో పలుచోట్ల వారిని పోలీసులు అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నివాసం ఉంటున్న పలువురు అధ్యాపకులను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటితో పాటు హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలువురు అధ్యాపకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం తర్వత వారిని వదిలిపెట్టారు.

వైభవంగా వీరప్పయ్యస్వామి రథోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారు జామున వైభవంగా ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం సాగింది. వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు జరిగిన రథోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. దేవరకద్ర మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దఎత్తున శైవభక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. హరహర మహాదేవ అంటూ స్వామివారి రథన్నా భక్తులు ముందుకు లాగుతూ పట్టణ ప్రధాన వీధుల్లో రథోత్సవం సాగింది. భాజభజంత్రీలు, కుర్వ డోళ్ల మారుమోగుతుండగా ఉదయం 7గంటల వరకు కొనసాగింది.

ఘనంగా పల్లకిసేవ...

దేవరకద్ర పట్టణంలో ఈశ్వర వీరప్పయ్యస్వామి పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో స్వామి పల్లకిసేవను నిర్వహించారు. ఈసందర్భంగా దారి పొడువునా ట్యాంకర్‌తో నీటిని పోశారు. మహిళ భక్తులు కడవలతో తెచ్చిన నీటిని రోడ్డుపై పోశారు. వాడ వాడలో ప్రజలు కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం స్వామి చక్ర స్నానం నిర్వహించి దేవాలయానికి చేర్చారు. సాయంత్రం దేవాలయంలో స్వామి డోలారోహణ ఘనంగా నిర్వహించారు. వెండి ఊయలలో స్వామి వారిని ఉంచి భజనలు, కీర్తనలు, పాటలు పాడారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



దేవరకద్రలో జరిగిన ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం

నిరంతరం మాతాశిశు సంరక్షణ సేవలు

నవాబుపేట: నిరంతరం మాతాశిశు సంరక్షణ సేవలు అందించి ఒక్క మరణం కూడా లేకుండ చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.పద్మజ సూచించారు. బుధవారం ఆమె నవాబుపేటలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మిషన్ ఇంద్రధనస్సు, ఓపీ, టీకాల వివరాలు ఆరాతీశారు. ఆస్పత్రిలో మందుల నిల్వలు కావాల్సిన మందులను ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో కొనసాగించే టీకాల విషయంలో సిబ్బంది పనితీరు, హాజరు రిజిష్టర్లు ఆమె పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు. వాక్సినేషన్ విషయంలో సమాయానికి టీకాలు వేయాలని దీనికి సంబంధించి పూర్తి బాధ్యత సిబ్బందిదేనని అన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డా.శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్ రాములు, బాలమ్మ, శ్రీనివాస్, విజయ,శరభలింగం, రాఘవేందర్, శారధ, కవిత ఉన్నారు.



నవాబుపేట ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.పద్మజ

డబ్బాల తొలగింపు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అక్రమంగా వేసిన డబ్బాలను అధికారులు తొలగించారు. బుధవారం తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ గీతాంజలి, జడ్చర్ల రూల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, క్రేన్, జేసీల సహాయంతో డబ్బాలను తొలగించారు. డబ్బాలను తొలగించడంతో ఉపాధి కోల్పోతామని కొంత మంది వ్యాపారులు విన్నవించుకున్నారు. జిల్లాఅధికారుల ఆదేశాలమేరకు తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యార్థులు ప్రస్తుత టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.కె.రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక న్యూటౌన్‌లోని శ్రీ వాసవి డిగ్రీ, పీజీ కళాశాలలో బీకాం, బీబీఏ విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తర్వాత ఎన్నో అవకాశాలు ఉంటాయన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను చేసి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కె.రజినీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.కొండస్వామి, యాజమాన్య సభ్యులు ధర్మపురం కుమారస్వామి, మాణిక్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.